మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా ధర్పల్లిలో ర్యాలీ తీస్తున్న ఆటోవాలాలు

బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

పూటగడవడమే కష్టంగా ఉన్నది

- ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేయాలి
- రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్ల నిరసన

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, డిసెంబర్ 13: 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మా కొంప ముంచుతున్నది.. వెంటనే ఆ పథకాన్ని రద్దు చేయాలి' అని డిమాండ్ చేస్తూ బుధవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి కామారెడ్డి - కరీంనగర్ ప్రధాన రహదారిపై గంటపాటు బైఠాయించి నిరసన తెలిపారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో ర్యాలీ తీశారు. నల్లగొండ జిల్లా హాలియాలో ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్, సూరేపల్లి, పేరూరు రూట్లలో నడిచే ఆటో డ్రైవర్లు ఆటోలతో పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. అనంతరం హాలియా ప్రధాన సెంటర్‌లో ధర్నా చేశారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో ఆటోలను నిలిపి యూనియన్ నాయకులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. నిర్మల్ జిల్లా ముథోల్‌లోని నయాబాది చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా రెంజల్, ధర్పల్లి మండల కేంద్రాల్లో, నిజామాబాద్ నగరంతోపాటు కామారెడ్డి జిల్లా జుక్కల్, రామారెడ్డి మండలం రెడ్డిపేట, దోమకొండలో ఆటో డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఆయా చోట్ల వారు మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం తమ ఉపాధిని దెబ్బతీసిందని అన్నారు. మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కారణంగా తాము ఉపాధి కోల్పోతున్నామని చెప్పారు. అప్పు చేసి ఆటోలు కొనుక్కున్నామని ఇప్పుడు ఈఎంఐలు కట్టలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఉపాధి కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆదుకోకపోతే తమ బతుకులు ఆగమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆటో చార్జీలు పెంచండి

హిమాయత్‌నగర్, డిసెంబర్ 13: పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచాలని తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బీ వెంకటేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలను అడ్డగోలుగా పెంచడంతో ఆటో కార్మికులపై భారంపడి జీవనోపాధికి ఆటంకం కలుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో, మోటార్‌రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, గ్రేటర్‌లో కొత్త ఆటోలకు పర్మిట్లు ఇవ్వాలని కోరారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ భర్త మృతి
- భార్య పరిస్థితి విషమం
- సాగు నష్టాలే కారణం

వీరన్న (ఫైల్)

కేసముద్రం, డిసెంబర్ 13: అప్పులు చేసి సాగు చేస్తే పంటలు చేతికి రాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన రైతు దంపతులు ఈ నెల 8న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ భర్త బుధవారం మృతి చెందాడు. భార్య పరిస్థితి విషమంగా ఉన్నది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని క్యాంపు తండాలో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ధరావత్ వీరన్న (40), లలిత దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు. వారసత్వంగా వచ్చిన మూడున్నర ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎకరన్నర భూమిలో మిర్చి, ఎకరం విస్తీర్ణంలో పత్తి సాగు చేశారు. మిర్చికి గుబ్బ రోగం రాగా పంటను కాపాడుకోవడానికి క్రిమిసంహారక మందులు పిచికారీ చేశారు. అయినా పంట చేతికి రాకపోవడం, మరోవైపు పత్తి పంట దిగుబడి తగ్గిపోయింది. మిగ్‌జాం తుఫాన్ కారణంగా చేతికి అందివచ్చిన వరి వర్షానికి తడిసి మొలకెత్తింది. మిర్చి, పత్తి, వరి పంటలకు సుమారు రూ.3 లక్షల వరకు అప్పు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టారు. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో అప్పులు తీర్చలేమని భావించిన దంపతులు మిర్చి తోట వద్ద ఈనెల 8న పురుగుల మందు తాగారు. చుట్టుపక్కల రైతులు గమనించి వారిని మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. వీరన్న పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. లలిత మహబూబాబాద్‌లో చికిత్స పొందుతుండగా, ఆమె ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్టు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. వీరన్న తండ్రి లచ్చు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు.

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

ఎంపీ పదవికి 'కొత్త' రాజీనామా

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచిన కొత్త ప్రభాకర్‌రెడ్డి తన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. బుధవారం బీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావు, ఎంపీలు బీబీ పాటిల్, మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా గెలిచినందుకు కొత్త ప్రభాకర్‌రెడ్డిని స్పీకర్ శాలువా కప్పి సత్కరించి, అభినందించారు.

సొంత పన్నుల్లో తెలంగాణ అగ్రపథం

మొదటిపేజీ తరువాయి...

ఘనత. దేశంలోని అనేక రాష్ట్రాలకు తెలంగాణ రోల్‌మోడల్‌గా మారింది. తొమ్మిదేండ్లలోనే ఆర్థిక రంగంలో అనూహ్య అభివృద్ధి సాధించింది. సొంత పన్నుల రాబడిలో అగ్రస్థానంలో నిలిచిందని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ రాష్ట్రాల బడ్జెట్‌లను రిజర్వు బ్యాంక్ విశ్లేషించింది. రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులపై నివేదిక విడుదల చేసింది.

సొంత పన్నుల్లో అగ్రస్థానం...

తెలంగాణ సహా వివిధ రాష్ట్రాలు పన్నుల రాబడిలో 70% కంటే ఎక్కువ ఆదాయాన్ని సొంత పన్నులతోనే పొందుతున్నట్టు ఆర్‌బీఐ తన నివేదికలో విశ్లేషించింది. తెలంగాణలో సొంత పన్నుల ఆదాయం వాటా 2021-22లో 73.2%, 2022-23లో 72.8%, 2023-24లో 72.7% ఉన్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. సొంత పన్నుల రాబడిలో తెలంగాణ అగ్రపథాన నిలవగా.. ఆ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర, హర్యానా, తమిళనాడు, గుజరాత్, కర్ణాటక, కేరళ, పంజాబ్ రాష్ట్రాలు ఉన్నట్టు పేర్కొన్నది. తొమ్మిదేండ్లలో సొంత పన్నుల రాబడి మార్గాలను తెలంగాణ ప్రభుత్వం ఏ విధంగా పెంచుకున్నదో ఆర్‌బీఐ వివరించింది. వాణిజ్య పన్నుల శాఖను స్వయంగా పర్యవేక్షించిన కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా అనేక సర్కిళ్లు ఏర్పాటు చేశారు. శాఖాపరమైన పరిశోధనలు, విశ్లేషణల కోసం ఎకనమిక్ ఇంటెలిజెన్స్ యూనిట్లను ఏర్పాటు చేశారు. దీంతోపాటు 'నా బిల్లు-నా హక్కు' నినాదంతో కొనుగోలుదారులు ప్రతి చెల్లింపునకు బిల్లు డిమాండ్ చేసే విధానం అమలు చేశారు. దీంతో సొంత పన్నుల రాబడి గణనీయంగా పెరిగింది. తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ పనితీరును, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌తో పాటు అనేక రాష్ట్రాలు అధ్యయనం చేశాయి. తెలంగాణకు వచ్చి ఇక్కడి విధానాలను తెలుసుకుని, ఆ రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయి.

అప్పుల కట్టడిలోనూ తెలంగాణ ఆదర్శమే

దేశంలోని అనేక పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే అప్పుల కట్టడిలోనూ తెలంగాణ ఆదర్శంగానే నిలుస్తున్నది. దేశంలోని అనేక పెద్ద రాష్ట్రాల కంటే తెలంగాణ చేసిన అప్పులు అదుపులోనే ఉన్నాయని ఆర్‌బీఐ నివేదికతో స్పష్టమైంది. జీఎస్డీపీలో అతితక్కువ అప్పులు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ 5వ స్థానంలో ఉన్నది. తెలంగాణ 2015-16 ఆర్థిక సంవత్సరంలో జీఎస్డీపీలో 15.7 శాతం అప్పులు చేసింది. ఆ తర్వాత 2016-17లో 12.4 శాతం, 2017-18లో 21.4 శాతం, 2018-19లో 22.2 శాతం, 2019-20లో 23.7 శాతం, 2020-21లో 28.8 శాతం, 2021-22లో 27.9 శాతం, 2022-23లో 26.8 శాతం రుణాలు సేకరించింది. బడ్జెట్ అంచనాల ప్రకారం... 2023-2024 మార్చి నాటికి అప్పులు రూ.3,89,672 కోట్లకు చేరనున్నాయి. రాష్ట్ర స్థూల ఉత్పత్తి(జీఎస్డీపీ)లో అప్పులు 27.8 శాతం ఉన్నాయి. రాష్ట్రం సేకరించిన ప్రతి పైసాను పకడ్బందీ ప్రణాళికతో భవిష్యత్తు తరాల కోసం వెచ్చించింది. అంతేకాదు.. రుణాల చెల్లింపునకు కూడా ప్రణాళికాబద్ధంగానే పరిమితిని విధించుకున్నది. రాష్ట్రంలో మొత్తం అప్పుల్లో ఏడాదిలోపే చెల్లించాల్సినవి 3.6 శాతం ఉన్నాయి. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం మిగిలిన రాష్ట్రాలు చేసిన అప్పులతో పోలిస్తే.. తెలంగాణ చేసిన అప్పులు ఎంతో అర్థవంతంగా ఉన్నాయి. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు వాటి జీఎస్డీపీతో పోలిస్తే తెలంగాణ కంటే ఎక్కువగా అప్పులు చేశాయి.

ప్రజలకు మరింత చేరువగా రెవెన్యూ సేవలు

- ట్రెసా నాయకుల ఆశాభావం

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రెవెన్యూ పాలన ప్రజలకు మరింత చేరువ అవుతున్నదని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం సచివాలయంలో ధరణిపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం నిర్వహించిన సమీక్షలో ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ హాజరయ్యారు. రైతులు, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, రెవెన్యూ శాఖ పటిష్టత, క్షేత్రస్థాయి సిబ్బంది ఆవశ్యకత తెలియజేస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ద్వారా సీఎంకు నివేదిక అందించినట్టు వారు చెప్పారు. అనంతరం సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ట్రెసా అసోసియేట్ అధ్యక్షుడు పూల్ సింగ్ హన్, ఉపాధ్యక్షుడు రమేశ్ పాక తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులు

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రెండో విడత పీహెచ్‌డీ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అమృత విశ్వ విద్యాపీఠం తెలిపింది. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://amrita.edu/PhD@2023 లింక్ ద్వారా ఈ నెల 17 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. పీజీలో కనీసం 60 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నది.

కోర్టు సమాచారం

పెన్షన్ డబ్బుల కోసం వృద్ధురాలి 60 ఏండ్ల పోరాటం

లోకాయుక్త తీర్పుతో ఎట్టకేలకు న్యాయం

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): భర్త పోయి 60 ఏండ్లు అయ్యింది. నాటి నుంచి పింఛన్ డబ్బుల కోసం ఆ మహిళ తిరగని ఆఫీసు లేదు. ఆరు దశాబ్దాలుగా కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో న్యాయ పోరాటానికి దిగిన ఆ వృద్ధురాలికి ఎట్టకేలకు లోకాయుక్తలో న్యాయం జరిగింది. ఇప్పటివరకు ఆమె రావాల్సిన పింఛన్ డబ్బులు మొత్తం ఇవ్వాలంటూ లోకాయుక్త తీర్పు ఇవ్వడంతో 60 ఏండ్ల పెన్షన్ బకాయిలు రూ.15.70 లక్షలను ట్రెజరీ అధికారులు ఆమెకు అందించారు. జీవిత చరమాంకంలో లోకాయుక్త జోక్యంతో తనకు న్యాయం జరిగిందంటూ ఆ వృద్ధురాలు ఆనందం వ్యక్తం చేశారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన శేషగిరిరావు రోడ్లు, భవనాల శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేసేవారు. 1962 ఫిబ్రవరి 6న ఆయన ప్రమాదవశాత్తు చనిపోయారు. తన భర్త మరణించారని, పెన్షన్ మంజూరు చేయాలంటూ ఆయన సతీమణి కృష్ణవేణి సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఎన్ని ఆఫీసుల చుట్టూ తిరిగినా, ఏండ్లు గడిచినా స్పందన రాలేదు. దీంతో ఆమె 2021లో లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన లోకాయుక్త బాధితురాలికి నెల రోజుల్లో పెన్షన్ మంజూరు చేయాలంటూ కాకినాడ ట్రెజరీ అధికారులను ఆదేశించారు. బాధితురాలికి రావాల్సిన పెన్షన్ బకాయిలు మొత్తం చెల్లించామని ట్రెజరీ కార్యాలయం తెలిపిందని రిజిస్ట్రార్ ఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం తెలిపారు.

'కాళోజీ'లో మిగిలిన మెడికల్ సీట్ల భర్తీ కరెక్టే

పిటిషన్లను కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో అన్ని దశల కౌన్సెలింగ్ పూర్తయ్యాక మిగిలిన సీట్ల భర్తీలో అక్రమాలు జరగలేదని హైకోర్టు తీర్పు వెలువరించింది. అన్ని రౌండ్ల కౌన్సెలింగ్ ముగిశాక సెప్టెంబరు 27నాటికి మిగిలిన సీట్ల భర్తీలో అక్రమాలకు ఆధారాలు లేవని తేల్చి చెప్పింది. నిబంధనల ప్రకారమే మిగిలిన 18 సీట్ల భర్తీ జరిగిందని స్పష్టం చేసింది. సీట్ల భర్తీలో అక్రమాలు, చట్టపరమైన, విధానపరమైన ఉల్లంఘనలు ఉన్నట్టుగా పిటిషనర్లు నిరూపించలేదని పేర్కొన్నది. కౌన్సెలింగ్ తర్వాత మిగిలిన సీట్ల భర్తీలో అక్రమాలు జరిగాయని, అడ్మిషన్లను రద్దు చేయాలని కోరుతూ ఏపీలోని కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కేటీ సాయి రేవంత్‌రెడ్డి, మరో విద్యార్థి దాఖలు చేసిన వ్యాజ్యాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్ కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు, రెండో కౌన్సెలింగ్ తర్వాత మిగిలిన సీట్ల భర్తీ చట్టప్రకారమే జరిగిందని తీర్పు చెప్పింది. పిటిషన్లను కొట్టివేసింది.

చిన్నారుల అదృశ్యంపై హైకోర్టు ఆందోళన

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చిన్నారుల అదృశ్యంపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లల అక్రమ రవాణా, బలవంతంగా యాచక వృత్తిలోకి దింపుతున్న ముఠాలు, లైంగిక వేధింపులకు గురిచేస్తున్న వాటిని అరికట్టేందుకు ఏం చర్యలు తీసుకునేదీ చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రంలో చిన్నారుల అదృశ్యంపై కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ, హోంశాఖల ముఖ్య కార్యదర్శులకు, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. పిల్లల అదృశ్యంపై ఈ నెల 11న పత్రికల్లో వచ్చిన కథనాన్ని హైకోర్టు సుమోటో ప్రజాహిత వ్యాజ్యంగా చేపట్టింది. దీనిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారించింది. ఇది తీవ్రమైన అంశమని అభిప్రాయపడింది. పూర్తి వివరాలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

పత్రాల ధ్వంసం కేసు విచారణ 16కు వాయిదా

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో పత్రాలు ధ్వంసం అయ్యాయన్న కేసు తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 16కు వాయిదా వేసింది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని నిందితుడు దాఖలు చేసిన కేసులో పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి ఓఎస్డీ గుండమరాజు కల్యాణ్‌కుమార్ ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ కే సురేందర్ బుధవారం విచారించారు. రాజకీయ కక్షతో కేసు నమోదు చేశారని, పత్రాల ధ్వంసానికి పిటిషనర్‌కు సంబంధం లేదని, ఊహాజనితంగా కేసు పెట్టారని ఆయన న్యాయవాది వాదించారు. వాస్తవానికి కార్యాలయాన్ని సచివాలయానికి ఎప్పుడో తరలించారని, పత్రాల ధ్వంసానికి ఆస్కారమే లేదని చెప్పారు.

కృష్ణా.. దాహార్తి తీర్చేనా?

- హైదరాబాద్‌కు పొంచి ఉన్న ముప్పు
- ఆందోళనకరంగా సాగర్ నీటిమట్టం
- అత్యవసర ఎత్తిపోత తప్పకపోవచ్చు
- 505 అడుగుల వరకు నీటి వినియోగానికి రాష్ట్రాల ఒప్పందం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరానికి తాగునీటి ముప్పు పొంచి ఉన్నదా? నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం చూస్తే నిజమేనని అనిపించకమానదు. కృష్ణా బేసిన్‌లో ఈ ఏడాది సరైన ఇన్‌ఫ్లో లేకపోవడంతో వచ్చే వేసవి ఎలా ఉంటుందనే చర్చ ఇప్పుడే మొదలైంది. సాగర్‌లో 510 అడుగుల నీటిమట్టం ఉంటేనే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతల ద్వారా హైదరాబాద్‌కు తాగునీటిని అందించడం వీలవుతుంది. తగ్గితే మాత్రం అక్కడి పంపులు నడపడం సాధ్యం కాదు. ప్రస్తుతం సాగర్‌లో 522.30 అడుగుల నీటిమట్టం ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల నీటి అవసరాలకుగాను 505 అడుగుల వరకు నీటిని వినియోగించుకునేందుకు ఒప్పందం జరిగింది. ఈ నేపథ్యంలో 510 అడుగుల కంటే నీటిమట్టం తగ్గితే అది హైదరాబాద్ తాగునీటి సరఫరాపై ప్రభావం చూపుతుంది.

వట్టిపోతున్న కృష్ణాబేసిన్

ఈ ఏడాది వర్షాలు అంతంతమాత్రమే కావడం, ఎగువన కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో కృష్ణాబేసిన్ వట్టిపోతున్నది. ఈ నీటి సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల పరిధిలోని ప్రాజెక్టులకు సుమారు 150 టీఎంసీల వరకు మాత్రమే ఇన్‌ఫ్లో వచ్చింది. వర్షాకాలంలో భారీ ఇన్‌ఫ్లోలు ఉంటేనే ఏడాది పొడవునా రెండు రాష్ట్రాలు సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయి. ఈ ఏడాది ఆశించిన ఇన్‌ఫ్లోలు లేకపోవడంతో సాగునీటి అవసరాలను సైతం తక్కువ చేసుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో సాగర్ ఎడమ కాల్వ కింద సాగు నీటిని విడుదల చేయలేదు. ఆంధ్రప్రదేశ్ మాత్రం కుడి కాల్వ కింద సాగునీటిని అందిస్తున్నది. ఎగువన శ్రీశైలం నుంచి అటు ఏపీ పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని వినియోగించుకుంది. ఇప్పుడు శ్రీశైలంలో నీటి నిల్వలు భారీగా తగ్గిపోవడంతో నీటిమట్టం పడిపోయి నీటిని విడుదల చేసుకునే వెసులుబాటు లేకపోవడంతో రెండు రాష్ట్రాలు తమ అవసరాలకు నాగార్జునసాగర్‌పైనే ఆధారపడాల్సి వస్తున్నది. ప్రస్తుతం 522.30 అడుగుల స్థాయిలో నీటిమట్టం ఉన్నది. రెండు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు చేసిన నీటి వినియోగ కేటాయింపులను సాగర్ నుంచే వాడుకుంటామని రెండు రాష్ట్రాల అధికారులు చెబుతున్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ 10 టీఎంసీల వినియోగానికి గతంలోనే అనుమతి ఉంది. మరో ఐదు టీఎంసీలు కావాలంటూ అధికారులు బోర్డుకు ఇండెంట్ పెట్టారు. దీంతోపాటు తెలంగాణ కూడా ఎడమ కాల్వ కింద తాగునీటి అవసరాలకు నీటిని వినియోగించుకోవాల్సి ఉంటుంది.

అత్యవసర మోటార్లు తప్పవా?

జూన్‌లో వర్షాకాలం మొదలవుతుంది. నాగార్జునసాగర్‌కు జూలై, ఆగస్టుల్లో వరద వచ్చే అవకాశాలుంటాయి. దాదాపు ఏడెనిమిది నెలల పాటు ఉన్న నీటి నిల్వలతోనే సరిపెట్టుకోవాలి. ఈ క్రమంలో సాగర్‌లో 510 అడుగులకంటే నీటిమట్టం తగ్గినట్టయితే అది హైదరాబాద్ తాగునీటి సరఫరాపై ప్రభావం చూపుతుంది. సాగర్‌లో ఈ స్థాయిలో నీటిమట్టం ఉంటేనే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టులోని మోటర్లు పంపింగ్ చేయడం సాధ్యమవుతుంది. ఆ ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోస్తేనే హైదరాబాద్‌కు తాగునీటి సరఫరా జరుగుతుంది. రెండు రాష్ట్రాల నీటి అవసరాలు, ముఖ్యంగా ఏపీ ధోరణి చూస్తుంటే కనీసంగా 15 టీఎంసీల నీటినైనా వాడుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాగర్ నీటిమట్టం పడిపోతే సాగర్ ఫోర్‌షోర్‌లో అత్యవసర మోటర్లు ఏర్పాటు చేసి హైదరాబాద్‌కు అందించాల్సి ఉంటుంది. గతంలో ఈ పరిస్థితులు రాగా, అత్యవసర మోటర్లు పెట్టారు. కాకపోతే గత కొన్నేండ్లుగా కృష్ణా బేసిన్‌కు మంచి వరదలు ఉండడంతో ఆ అవసరం ఏర్పడలేదు. తాజా పరిస్థితుల దృష్ట్యా రానున్న వేసవిలో అత్యవసర మోటర్లు తప్పవనే వాదనలు వినిపిస్తున్నాయి.

వాతావరణ మార్పులతో చీడపీడలు

- ఇక్రిసాట్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): వాతావరణంలో మార్పులు చీడపీడలకు కారణమవుతున్నది. అంతర్జాతీయ స్థాయిలో పంటల దిగుబడి, సాగు విధానాలు, వాతావరణంలో మార్పులు వంటి అంశాలపై ఇక్రిసాట్ అధ్యయనం చేసింది. ఏటా కలుగుతున్న మార్పులు దిగుబడిని తగ్గించడమే కాకుండా, చీడపీడల తీవ్రతను పెంచుతున్నట్టు తేలింది. ఆహార ఉత్పత్తులు, ఆహార భద్రత సాధించడమే లక్ష్యంగా అధ్యయనం చేస్తున్న నేపథ్యంలో పర్యావరణ మార్పుల ప్రభావం కీలకంగా మారనున్నది. వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల ప్రభావం నానాటికి పెరుగుతున్నది. ఓ వైపు జనాభా పెరుగుతుంటే మరోవైపు పంటల విస్తీర్ణం తగ్గుతున్నది. జనాభా అవసరాలకు అనుగుణంగా పంటల ఉత్పత్తులను పెంచాల్సిన అవసరం ఏర్పడుతున్నది. వాతావరణ మార్పులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్న క్రమంలో ఏటా వేల ఎకరాల విస్తీర్ణంలో పంట నష్టం వాటిల్లుతున్నది. వాతావరణంలో మార్పులతోపాటు అధికంగా వినియోగిస్తున్న కృత్రిమ ఎరువులు కూడా చీడపీడలకు కారణం అవుతున్నట్టు చెబుతున్నారు. ఈ క్రమంలో కొన్ని పంటల కోసం కొత్త వంగడాలు రూపకల్పన చేసినా.. పంటల దిగుబడి ఆశించిన మేర పెరగడం లేదనే భావన ఉన్నది. ప్రస్తుతం దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇక్రిసాట్ అధ్యయనం చేస్తుండటంతోపాటు, అభివృద్ధి చేసిన నూతన వంగడాలతో వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్టు ఇక్రిసాట్ వర్గాలు వెల్లడించాయి.

గిరిజన వర్సిటీ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

- రాష్ట్రపతి ఆమోదం అనంతరం యూనివర్సిటీ ఏర్పాటు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: తెలంగాణలో సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు బుధవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు(సవరణ) బిల్లు-2023కు మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. ఈ బిల్లుకు గత వారమే లోక్‌సభ ఆమోదించింది. బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపిన వెంటనే యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం-2014లో హామీ ఇచ్చిన ప్రకారం ఈ వర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ప్రాంతీయ ఆకాంక్షలను ఈ వర్సిటీ నెరవేర్చనుంది. ఈ యూనివర్సిటీ ఉన్నత విద్య అందుబాటును, నాణ్యతను, తెలంగాణ ప్రజల పరిశోధనా సౌకర్యాలను పెంపొందిస్తుందని బిల్లులో పేర్కొన్నారు. భారతదేశ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలపై ఈ యూనివర్సిటీలో పరిశోధనలు చేసే అవకాశం లభించనుంది. ఈ యూనివర్సిటీని రూ.889.07 కోట్లతో నెలకొల్పనున్నారు. ఇందుకోసం ములుగు సమీపంలో 200 ఎకరాల స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వం గతంలోనే గుర్తించింది. బిల్లు ఆమోదం పొందిన సమయంలో పార్లమెంట్ భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రతిపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. ఈ సందర్భంగా ఐఐటీలు, ఐఐఎంలలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థుల డ్రాపౌట్ రేటు పెరుగుతున్నదని సభ్యులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ వారికి వేరే మంచి అవకాశాలు రావడం, ఇతర విద్యాసంస్థల్లో ప్రవేశాలు లభించడం ఇందుకు ఒక కారణమని తెలిపారు.

సీఎంను కలిసిన జర్నలిస్టుల బృందం

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజేయూ) అధ్యక్షుడు కే శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే విరాహత్ అలీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపింది. జర్నలిస్టుల ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జర్నలిస్టు యూనియన్ల విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించారు. సీఎంను కలిసిన ప్రతినిధి బృందంలో ఐజేయూ జాతీయ కార్యదర్శి వై నరేందర్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కే సత్యనారాయణ, టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి విష్ణుదాస్ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు కే రాంనారాయణ, యూనియన్ నాయకులు కే రాములు, శిగా శంకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎయిర్‌పోర్టుకు రెండు మెట్రో మార్గాలు

- సమీక్షలో సీఎం రేవంత్ ప్రతిపాదన

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సచివాలయంలో సమీక్షించారు. విస్తరణ పనులపై మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డితోపాటు ఇతర అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రెండు ఎయిర్‌పోర్ట్ కొత్త మార్గాలపై దిశానిర్దేశం చేశారు. ఒక మార్గాన్ని ఎంజీబీఎస్, ఫలక్‌నుమా నుంచి, రెండో మార్గాన్ని ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట మీదుగా పరిశీలించాలని సూచించారు. ఇందులో మైలార్‌దేవ్‌పల్లి, జల్‌పల్లి, పీ7 రోడ్డు మీదుగా ఎయిర్‌పోర్ట్ వరకు, మరొకటి బార్కాస్, పహాడీషరీఫ్, శ్రీశైలం రోడ్డు మీదుగా ఎయిర్‌పోర్ట్ మార్గాలను పరిశీలనకు ప్రతిపాదించాలని సూచించారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్‌ను ఓల్డ్ సిటీ మీదుగా ఎంజీబీఎస్, ఫలక్‌నుమా, ఎల్బీనగర్ ప్రాంతాలను కలుపుతూ నిర్మించేలా చూడాలని సూచించారు. హైదరాబాద్ విశ్వనగరంగా ఎదుగుతున్న క్రమంలో అన్ని ప్రాంతాల నుంచి మెట్రో రవాణా సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. కందుకూరు సమీపంలో ఫార్మా సిటీ కోసం సేకరించిన భారీ విస్తీర్ణంలో పర్యావరణహిత మెగా టౌన్‌షిప్‌కు ప్రణాళిక రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.